# అతడి సాహసం

రామకృష్ణ లంచిహోం ప్రొప్రయిటరుకు ఎవడో కుర్రవాడు ఒక కవరు ఉత్తరం తెచ్చియిచ్చాడు. దాన్నివిప్పి ఆయన చదువుకున్నాడు. అందులో యిలా వుంది:—

'ఉభయ కుశలోపరి.

'మహాశయా, మీరు నన్ను ఎరగరు. కాని, నేను రోజూ మీ హోటల్లోనే టిఫిన్ తింటూంటాను. కొన్ని సంవత్సరాలగా మిమ్మల్ని, మీ హోటల్ని సందర్శించని రోజంటూ లేదు, నా జీవితంలో—

'ఈ ఉత్తరం మీరు చూచుకునే వేళకి సరిగ్గా మీ హోటల్లో ఒక టేబిల్ కింద ఒక తాటాకుబుట్ట వుంటుంది-అది నేను మీ హోటల్లో బుద్ధిపూర్వకంగా విడిచి వచ్చాను. ఈ ఉత్తరంద్వారా ఆ సమాచారాన్ని మీకు తెలియజేస్తున్నా.

'ఆ తాటాకు బుట్టలో ఏముందో మీరు గ్రహించగలరా? వొద్దు, మీ తరపున నేనే గ్రహించి చెబుతా—

'హడిలిపోకండి-అందులో వున్నవి బాంబులు కావు-మూడు బ్రతికి వున్న పిల్లి పిల్లలు—

'ఇంకా మీకు అర్థం కాలేదనుకుంటా - నేనొక సామాన్య గృహస్తును-వృత్తి స్కూలుమేస్టరీ -జీతం యాభైరాళ్లు-నా ఇంట్లోనే పిల్లల్ని పెట్టింది ఒక పిల్లి, ఇంకెక్కడా చోటు లేనట్టుగా—

'ఆ పిల్లల్ని విడిపించుకునే సామర్థ్యం నాకు లేదు—పోషించే సామర్థ్యం అంతకన్నా లేదు, ఈ రేపనింగు రోజుల్లో-వీటిని ఏ వీధులోనన్నా విడుస్తే, అవి పసికందులు-ఏ కుక్కో-వాటిని చంపేస్తుంది - ఆ పాపం నాకు చుట్టుకుంటుంది-

'గట్టిగా ఆలోచించి, వాటిని గాలితగిలే బుట్టలో పెట్టి, పొద్దున్న టిఫినుకు వచ్చినప్పుడు మీ హోటల్లో వుంచేసి వచ్చాను. మీరు వాటి

నిమిత్తమై ఏ విధమైన ఖర్చు, శ్రమపడ నక్కర్లేదు. వాటిని మీ హోటల్లో వుండనిస్తే, బల్లలకింద దూరి వాటి బ్రతుకుదెరువు అవే చూసుకుంటాయి-

'నేను చేయలేని పాపాన్ని మీరు చేయరనీ, నేను చేయలేని పుణ్యాన్ని మీరు చేస్తారనీ భావిస్తూ శెలవు తీసుకుంటున్నా.'

---

# సెక్సు విషయాలు

పాశ్చాత్య దేశాల్లో - ముఖ్యంగా ఇంగ్లండు, అమెరికాలలో - పురుషులకంటే స్త్రీలు జాస్తీగా ఉండటం జగద్విదితం. కాగా, అక్కడ సాధారణంగా నలుగురైదుగురు పేరంటాళ్లు ఒకే అభాగ్యుడి మెడకు చుట్టబెట్టుకుని పెళ్ళిమిషతో వాడి ప్రాణాలను తీస్తారు. ఇంతేకాక ఏ దేశపు పురుషులు ఆ దేశపు స్త్రీలకు చాలక అమెరికా స్త్రీలు ఇంగ్లండు వెళ్ళి, ఇంగ్లీషు స్త్రీలు అమెరికా వెళ్ళి పెళ్ళి ప్రయత్నాలు చేసుకుంటూ వుంటారు.

* * *

జర్మనీలో స్త్రీ పురుషుల సంఖ్య ఎట్లావున్నా అక్కడ ఎవరు ఎవర్ని ప్రేమించ వలసిందీ, పెళ్ళాడ వలసిందీ హిట్లరే నిశ్చయిస్తాడు. ఎవరూ ఎవర్నీ పెళ్ళాడ్డానికి వీల్లేకపోతే అటువంటివారికి పెద్దపెళ్ళి కాన్సన్ట్రేషన్ క్యాంపు - తప్పితే యుద్ధరంగం. కాగా, జర్మనీలో స్త్రీ పురుషుల సంఖ్య ఎట్లావున్నా హిట్లర్ ప్రభుత్వం చల్లగావున్నన్నాళ్ళు అక్కడ Sex కు, వివాహసంస్థకు సంబంధించిన ఏ జిజ్ఞాసలూ, మీమాంసలూ, ధర్మసందేహాలు ఏర్పడవు.

* * *

ఫ్రాన్సులో ప్యారిసు పట్టణమూ, మాంటికార్లో, ఇతర పేరుపడిన విహారస్థలాలూ, హోటళ్ళూ, డ్యాన్సుహాలులూ మొదలైనవన్నీ